కథ


# మా బాదం చెట్టు

మల్లాది వెంకటకృష్ణమూర్తి

నా చిన్నప్పటి విషయాల్లో నాకు గుర్తున్న వాటిలో ప్రధానమైనవి ఈ మాటలు. తరచూ నేను మా అమ్మని అడిగేవాడిని.

''అమ్మా! ఆ బాదం చెట్టుని ఎవరు కనుక్కున్నారు?''

''నువ్వేరా, నీ చిన్నప్పుడు ఓ రోజు నువ్వు నా దగ్గరకి పరిగెత్తుకు వచ్చి చెప్పావు. 'అమ్మా! మనింట్లో ఓ మామిడి మొక్క వచ్చింది చూపిస్తారా' నేను నువ్వూ కలిసి అక్కడికి వెళ్ళాం. సన్నటి, చిన్న మొక్కని చూపించావు నువ్వు. 'అది మామిడి కాదురా! బాదం మొక్క అని చెప్పాను నేను' గుర్తుంది కదా?''



లేకపోయినా ఉందనే వాడిని. నాకు ఆమాటలు ఆనందం కలగచేసేవి. దాదాపు రెండు మూడు రోజులకోసారి మా మధ్య ఈ సంభాషణ జరిగేది.

ఇప్పుడనిపిస్తోంది, అది నిజమై ఉండదని. ఎందుకంటే నేనుబాల్యంలో ఉండగానే అది బాగా ఎదిగి కాయలు కాస్తోంది.

నా చిన్నతనంలో చాలా మంది ఇళ్ళల్లో మొక్కలు పెరిగేందుకు ఖాళీ స్థలం ఉండేది. దొడ్డిగా వ్యవహరించే ఆ స్థలంలో చాలా ఇళ్ళల్లో మామిడి, కరివేపాకులాంటి చెట్లతో పాటు బాదం చెట్టు కూడా ఉండేది. ఐతే విజయవాడ సత్యనారాయణపురంలోని మా సందులోమాత్రం కేవలం ఆ ఇంట్లోనే బాదం చెట్టుండేది. అంచేత రిక్షావాడికి గుర్తు చెప్పేటప్పుడు 'బాదం చెట్టిల్లు' అని చెప్పేవాళ్ళం.

వేసవిలో ఆ బాదం చెట్టు బాగా కాయలు కాసేది. మా పిల్లలందరికీ దానికాయలు పండగే. మాలో పెద్దవాడైన రామం బాదం చెట్టెక్కి కాయలని కోసి కిందపడేసేవాడు. మేం వాటిని పంచుకుని కంకరరాళ్ళు ఏరుకుని వచ్చేవాళ్ళం. ఆ ఆకుపచ్చ కాయలని అడ్డంగా ఇంకో రాతి మీద ఉంచి గట్టిగా దెబ్బలు వేస్తే పైతొక్కు చీలి లోపలి డిస్క్ చప్పుడు చేస్తూ పగిలేది. అందులో సన్నగా పొడుగ్గా బాదం పప్పు ఉండేది. అది ఎంతో రుచిగా ఉండేది. కొన్ని కాయల్లో బాదంపప్పు సన్నగా రేకులా అప్పుడే ఏర్పడుతూ ఉండేది. లోపల కండ ఉండేదికాదు. వాటిని తినకుండా పారేసే వాళ్ళం.

వేసవిలో బాదంచెట్టు కొమ్మకి తాడుతో కట్టిన ఉయ్యాల మీద ఊగేవాళ్ళం. మా ఇంట్లో చిన్నవాడినైన నాకు ఊగడానికి మిగిలిన వాళ్ళు ఎక్కువ అవకాశం ఇచ్చేవాళ్ళు. మా మూడో అన్నయ్య ఎక్కువగా నన్ను ఊపేవాడు. ఊయ్యాల పైకెళ్ళి కిందకి దిగేప్పుడు కళ్ళు మూసుకుంటే ఓ తమాషా అనుభూతి కలిగేది.

నా కుడి చెవికి, కుడి కంటికి సరిగ్గా మధ్యగల చిన్న మచ్చ ఓ రోజు ఊయ్యాల మీంచి పట్టుతప్పి కొద్దిదూరంలో ఉన్న రోలు మీదపడ్డ గుర్తు.

రోజూ నిద్ర లేవగానే మేం బాదం చెట్టు కిందకి పరిగెత్తేవాళ్ళం. బాగా పండిన ఎర్రటి బాదం కాయలు నేలమీదరాలి ఉండేవి. పై తొక్కు తింటే తియ్యగా ఎంతో రుచిగా ఉండేవి. చేతికి బట్టలకి ఎర్రటిరంగు అంటేది. తర్వాత దాన్ని పగలకొడితే పెద్దపప్పు ఖచ్చితంగా లోపల ఉండేది.

ఒక్కోసారి బొగ్గుల కుంపటి మీద సత్తు గిన్నెలో కాగే చారులో బాదంపప్పులని మేము అమ్మకి తెలియకుండా వేసే వాళ్ళం. అన్నం తినేటప్పుడు అవి ఎవరికి వస్తాయా అని చూసే వాళ్ళం.

బాదం చెట్టు నీడలోనే మా ఆటలు సాగేవి. మిగిలిన చెట్లు అంత నీడని ఇచ్చేవి కావు. మా రెండో అన్నయ్య బాదం చెట్టు ఎక్కి సౌకర్యంగా ఉన్న ఓ కొమ్మ మీద కూర్చుని చదువుకునేవాడు. ఆటల్లో అయితే వాడు రాజు, ఆ కొమ్మ సింహాసనం. మేం సైనికులం కాబట్టి కింద నించునే వాళ్ళం. మంత్రి, సేనాధిపతి అంటే పక్కింటి చంద్రం, మా నాలుగో అన్నయ్య కింది కొమ్మల మీద కూర్చునే వారు. మాటలతోనే మా ఆటలు సాగేవి.

''సేనాధిపతీ! పొరుగు రాజు సైన్యం ఎంత?'' అని మా అన్నయ్య అడిగేవాడు.

''మనకన్నా చాలా తక్కువ రాజా'' జవాబు చెప్పేవాడు సేనాధిపతి.

''మంత్రీ! మన ఊరి విశేషాలేమిటి?''

''అంతా హాయిగా జీవిస్తున్నారు రాజా''

ఒకోసారి రాజు యుద్ధం చేయమంటే, కింద ఉన్న మేము సైనికులం ఒకరితో మరొకరు పోట్లాడేవాళ్ళం. మాలో కొందరు శతృసైనికులన్నమాట.

నేను సేనాధిపతిగా ఉండాలన్న మోజు తీరకుండానే నా బాల్యం గడిచిపోయింది.

మా సందుచివర పూరిపాకలో అద్దెకుంటే హనుమంతరావు మాస్టారు తరచూ మా ఇంటికి వచ్చి నేల రాలిన బాదం ఆకులని ఏరుకుని తెచ్చే వాడు. ఆయన వాటిని విస్తళ్ళుగా కుట్టి అన్నం తినడానికి వాడుకునేవాడు.

ఆయన విస్తళ్ళు కుట్టడం చూడటం నాకు ఆనందంగా ఉండేది. పుల్లని తీసుకుని దాన్ని మధ్యకి చీల్చేవారు. రెండు బాదం ఆకులని పక్కపక్కనే ఉంచి పూచికపుల్లని వాటి అంచుల్లోకి చొప్పించి కుట్టి విరిచేవాడు. అలా రెండు పూచికపుల్లలు పూర్తయ్యేసరికి ఓ గుండ్రటి బాదం విస్తరి తయారయ్యేది.

ఆ చెట్టు మా ఇంటి కాంపౌండ్ వాల్‌కి దగ్గరగా ఉండడంతో కొన్ని కొమ్మలు బయట రోడ్డుమీదకి విస్తరించుకున్నాయి. రిక్షా వాళ్ళు దాని నీడలో రిక్షాలు ఆపుకునేవారు. దాంతో అది 'అనఫిషియల్ రిక్షా స్టాండ్'గా ఉపయోగించేది. వాళ్ళు అక్కడ మేక – పులి ఆటని డబ్బుపెట్టి ఆడుకునేవారు. అది చూడటం మాకు చక్కటి వినోదం.


రోడ్డు ఊడ్చేవాళ్ళు దీపావళి మామూలుకి వచ్చినప్పుడు వాళ్ళకి డబ్బు ఇవ్వద్దనే వాళ్ళం. ఎందుకంటే, నెలకోసారైనా వాళ్ళు మా నాన్నతో 'చెట్టు కొట్టించండి ఆకులు రాలి రోడ్డంతా కరాబవుతోంది' అనేవాళ్ళు.

**ఒక్కోసారి బొగ్గుల కుంపటి మీద సత్తు గిన్నెలో కాగే చారులో బాదంపప్పులని మేము అమ్మకి తెలియకుండా వేసే వాళ్ళం. అన్నం తినేటప్పుడు అవి ఎవరికి వస్తాయా అని చూసేవాళ్ళం.**




కాకతీయ గడపలో కాలు పెట్టండి
మీ గుమ్మానికి కళ్యాణ తోరణం కట్టండి

కాకతీయ మ్యారేజెస్ ప్రై. లిమిటెడ్
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక, అమీర్‌పేట్, హైదరాబాద్ - 500 073.
ఫోన్ : 040-2374 7777, 09396 999 999



శ్రీమతి & శ్రీ చిరంజీవి యలమంచి

FREE online registration & Free search

AN ISO 9001:2000 ORGANISATION
www.kaakateeya.com
www.telugumarriages.com
www.kannadamarriages.com
www.tamilmarriages.com

| | | | |
|---|---|---|---|
| అమీర్‌పేట్ | 098481 55222 | చెన్నై (అన్నానగర్) | 093839 99999 |
| కూకట్‌పల్లి | 093913 11444 | (చెన్నై) టి. నగర్ | 093400 99993 |
| ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ | 099855 47475 | (చెన్నై) పోరూర్ | 093855 99077 |
| దిల్‌సుఖ్‌నగర్ | 098485 66733 | (చెన్నై) తాంబరం | 093400 99993 |
| విజయవాడ | 093922 92939 | బెంగుళూరు | 093429 39345 |
| గుంటూరు | 098485 35375 | జయానగర్ | 093429 39343 |
| తెనాలి | 098480 31931 | మైసూరు | 093429 39342 |
| విశాఖపట్నం | 098481 63833 | కోయంబత్తూరు | 093457 94668 |
| రాజమండ్రి | 098485 35377 | సేలం | 093855 99066 |
| కాకినాడ | 098483 37378 | మధురై | 093603 35233 |
| ఖమ్మం | 093470 59988 | వెల్లూర్ | 093449 94400 |
| ఒంగోలు | 098487 11223 | తిరుచి | 098428 01111 |
| నెల్లూరు | 098481 97222 | పాండిచ్చేరి | 098421 27777 |
| తిరుపతి | 098485 35378 | ఈరోడ్ | 093855 99011 |
| కర్నూల్ | 093900 33815 | అనంతపూర్ | 093460 09348 |

www.kaakateeya.com

ఒకోసారి మా అమ్మ కూడా మా నాన్నతో చెప్పేది బాదం చెట్టుని కొట్టించేయమని.

''వెధవ చెట్టు. కూరా, పళ్లూ ఇవ్వదు. రాలే బాదం ఆకులని ఏరలేక ఛస్తున్నాను''

''అలాగేలే బొగ్గుల రాముడితో చెప్పి కొట్టిస్తాను'' అనేవారు.

''వద్దండి నాన్నగారు కొట్టించకండి'' అనే వాళ్ళం మేం.

''అలాగే'' అనేవారు.

బాదం చెట్టుమీద గోరింకలు, కాకులు గూళ్ళు కట్టుకునేవి. ఎప్పుడు రామచిలకలు కనిపించేవి. అవి బాదం పండ్లని కొరికి తినడానికి వచ్చేవి. మా రెండో అన్నయ్య వాటిని పట్టుకుని పెంచుకోవాలని అనేక ప్రయత్నాలు చేసేవాడు. తాళ్ళతో తనకి తోచిన రీతిలో కొమ్మల్లో ఉచ్చులు ఏర్పాటు చేసేవాడు.

కాని ఒక్క దాంట్లో కూడా ఎన్నడూ ఒక్క రామ చిలక కూడా చిక్కుకోలేదు.

ఇంకా వడ్రంగి పిట్టలు,పిచ్చుకలు, పొడుగు తోక పిట్టలు దాదాపు డజను రకాల పక్షులు బాదం చెట్టు మీద మాకు కనిపించేవి. కాకులు పండిన బాదం పళ్ళని తీసుకెళ్లి ఇంకెవరి ఇంట్లోనో పడేసేవి. తరచు నా స్నేహితులు, 'మీ బాదం పండుని తెచ్చి కాకి మా ఇంట్లో పడేసింది' అనేవారు.

బాదం చెట్టు మీది పక్షులు ఉదయం, సాయంత్రాలు తెగ అరిచేవి.

ఆకురాలు కాలంలో బాదం చెట్టు ఆకులు పసుపుపచ్చ రంగులోకి తిరిగి నేల రాలేవి. వాటిని ఏరే బాధ్యత పిల్లలది.

ఎవరింట్లోనైనా పెళ్ళయితే నెలముందే మా నాన్నగారు బాదం చెట్టు కొమ్మలని కొన్నిటిని కొట్టించి వాళ్ళకి పంపేవారు. దొడ్లో ఎండాక దాన్ని కట్టెలపొయ్యికి కట్టెలకోసం వాడుకునేవారు. అలాంటి సందర్భంలో కొట్టిన కొమ్మల దగ్గరకి పిల్లలంతా చేరే వాళ్ళం. బాదం కాయలు కోసుకునేవాళ్ళం. వాటి ఆకులని తెంపాల్సిన బాధ్యత కూడా మాదే.

నాకు బాగా గుర్తు. ఓ రోజు ఆకులన్నీ తెంపాక పెద్ద వర్షం వచ్చి సందంతా నీటిలో, గోదురు కప్పలతో నిండిపోయింది. వేగంగా ప్రవహించే ఆ నీటిలో మేం బాదం ఆకులని వేస్తే, అవి క్షణాల్లో మాయం అయ్యాయి.

వేసవిలో ఆరుబయట బాదంచెట్టు కిందే మా పడకలు.

మా నాన్నగారు ఆఫీస్ నించి రాగానే దొడ్లో తొట్టిలోని నీళ్ళతో కాళ్ళు కడుక్కుని, ఓ సారి బాదం చెట్టు దగ్గర ఆగి తన చేతులతో కింది కొమ్మని ముట్టుకునేవారు. అంతదాకా చిరాగ్గా ఉండే మా నాన్నగారిలో చిరాకంతా తక్షణం మాయమయ్యేది. ప్రశాంతంగా, చిరునవ్వుతో ఇంట్లోకి వచ్చేవారు. పిల్లలందర్నీ పలకరించాకే, మా అమ్మ ఇచ్చే కాఫీ గ్లాసుని అందుకునే వారు.

ఉదయం ఆఫీస్‌కి వెళ్లేప్పుడు మళ్ళీ బాదం చెట్టు దగ్గరకి వెళ్ళి కింది కొమ్మ నించి ఏదో అందుకున్నట్లుగా నటించి ఆఫీస్‌కి వెళ్ళిపోయేవారు.

కొత్త వాళ్ళకి ఆయన చర్య అర్థమయ్యేది కాదు. మమ్మల్ని అడిగితే గర్వంగా చెప్పేవాళ్ళం.

''అది మా నాన్నగారి సమస్యల చెట్టు. ఆయనకి ఆఫీస్‌లో ఎన్నో సమస్యలు. అయితే వాటిని ఇంట్లోకి తీసుకురాకూడదని రోజూ ఆఫీస్ నించి రాగానే ఆ సమస్యలని ఆ చెట్టు కొమ్మకి తగిలించాకే ఇంట్లోకి వస్తారు. మళ్ళీ మర్నాడు ఉదయం ఆఫీస్‌కి వెళుతూ దాన్ని వెంట తీసుకువెళ్తారు''

మా నాన్నగారు నవ్వుతూ వారికి చెప్పేవారు.

''తమాషా ఏమిటంటే, ఉదయం నేనా చెట్టు దగ్గరికి వెళ్ళి చూస్తే, క్రితం సాయంత్రం నేను ఎన్ని సమస్యలని తగిలించానని నాకు గుర్తో అన్ని సమస్యలు ఉండవు''

మా నాన్నగారి సంతానంలో మేం ఎవరం మా ఆఫీస్ సమస్యల వల్ల కలిగే చికాకుని ఇంట్లోని కుటుంబ సభ్యుల మీద చూపించి ఎరగం. మా నాన్నగారు మాకు ఈ విషయంలో ఆదర్శంగా ఉండటానికే ఆ బాదం చెట్టుని వాడుకుని ఉంటారని నాకు పెద్దయ్యాక అర్థమైంది.

మా బాదంచెట్టు కింద మా అక్కయ్య, చెల్లాయిలు ఎన్ని వందల సార్లు బొమ్మలపెళ్ళిళ్ళు చేసుకునేవారో! కొబ్బరాకుల బూరలతో మగపిల్లలమంతా దానికి సంగీతాన్నందించే వాళ్ళం.

మేం స్కూలు నించి రాగానే బాదం ఆకులు కోసి తెచ్చుకుంటే మా అమ్మ మాకు వాటిలో టిఫిన్ వడ్డించేది.

మేం ఆ ఇల్లు అమ్మి మరో ఊరికి వెళ్ళాల్సిన సమయం వచ్చింది. నేను బాదం చెట్టు గురించి బాధపడ్డాను. కొత్త యజమాని దాన్ని ఉంచుతాడా? లేక ఆకులతో న్యూసెన్స్ అని కొట్టేయిస్తాడా?

''నాన్నగారూ ఇల్లు కొనే వాళ్లకి చెప్పండి. బాదంచెట్టుని కొట్టద్దని'' పిల్లలంతా కోరాం.

''అలాగే'' ఒప్పుకున్నారు నాన్నగారు.

మేం ఆ ఇంటిని వదిలిన రెండేళ్ళదాకా నాకు ఆ బాదం చెట్టు గురించిన ఆలోచన అప్పుడప్పుడూ వస్తూనేవుంది.

నాలా మా బాదం చెట్టుని మర్చిపోనిది నాతో పాటు మా మూడో అన్నయ్య. హ్యూస్టన్ నించి ఎప్పుడైనా ఫోన్‌చేస్తే, 'ఏరా బెజవాడ వెళ్ళావా? మన బాదంచెట్టు ఉందో లేదో చూసావా? అని అడుగుతూంటాడు.

కొన్నేళ్ళ తర్వాత ఓ సారి ఆఫీసుపని మీద నేను విజయవాడ వచ్చినప్పుడు ఓసాయం సంధ్యా సమయంలో మా పాతింటిని చూడటానికి వెళ్ళాను. దూరం నించి చూస్తే, మా ఇంటి స్థానంలో నాలుగంతస్థుల అపార్ట్‌మెంట్ బిల్డింగ్ కనిపించింది.

నా మనసు బాధతో మూలిగింది.

బాదంచెట్టు కొట్టేసి ఉంటారనుకున్నాను. దగ్గరకి వెళ్ళి చూసాను నా కళ్ళు మిలమిల మెరిసాయి.



ఉంది!

అది ఆ బిల్డింగ్‌కి అడ్డు రానంత దూరంగా కాంపౌండ్ వాల్‌కి ఆనుకుని ఉంది కాబట్టి కొట్టించలేదనుకున్నాను. అది చిన్నప్పటికన్నా, విస్తరించుకుంది. మా నాన్న కొట్టించినట్లు ఎవరూ కొమ్మలు కొట్టించే శ్రద్ధ తీసుకున్నట్లు లేదు. నాకు తెలిసిన దాని కన్నా పొడుగ్గా కూడా ఉంది. రకరకాల పక్షులు కిలకిలా రావాలు చేస్తున్నాయి. ఓ గోధుమరంగు కుక్క దాని నీడలో పడుకుని నిద్రపోతోంది.

ఆ చెట్టు కింద నిలబడితే నాకు చిన్ననాటి స్మృతులన్నీ గుర్తుకు వచ్చాయి. సేనాధిపతి కొమ్మ ఒక్కటే ఉంది. మంత్రి కొమ్మని గుర్తు పట్టలేకపోయాను. ఉందో పోయిందో రాజు సింహాసనం కొమ్మ మాత్రం కచ్చితంగా లేదు.

కింద పడ్డ రెండు బాదంపళ్ళని ఏరి తీసుకున్నాను. ఒకటి చిలక కొరికింది. దాని కంటిన మట్టిని కర్చీఫ్‌తో తుడుచుకుని తిన్నాను. ఎంత కాలానికి నా నాలుకకి ఆ బాదం పండురుచి?

రాతికోసం చూసాను కాని అంతటా సిమెంట్ ఫ్లోరింగ్. చుట్టు పక్కల నాకు కంకర రాయి కనపడలేదు. వాటిని కర్చీఫ్‌లో చుట్టి జేబులో వేసుకున్నాను.

నేనుండే కాంక్రీట్ జంగిల్‌లో మా పిల్లలకి ఇంతవరకూ బాదం పప్పు రుచి తెలీదు.

నేను కనిపెట్టానని చెప్పి నన్ను బాల్యంలో మా అమ్మ ఆనందింప చేసిన ఆ చెట్టు వంక తృప్తిగా చూసి వెనక్కి తిరిగాను, నా వెంట కారులో తెచ్చిన తాళ్ళతో వాటికొమ్మలకి మూడు ఉయ్యాలలు కట్టాకే.

★